# లోయలు

నగరం చివర పాడుబడిన మేడ సగం కూలిపోయింది. గత వైభవాన్ని తలపోస్తూ విలపిస్తూ కూలలేని గదులు ఇంకా ఉన్నాయి. సున్నం రాలిపోయిన భవనం అంతా నల్లకప్పు వేసింది. ఎదురుగా కళా విహీనంగా మారిన పూలతోట. తోట మధ్యలో బావి. బావి చుట్టూ నారింజలు. నిమ్మలు, నిమ్మపూత పరిమళం మెల్లిగా కదులుతూంది, వాటి చెంత కలువపువ్వు ఆకారంలోఉన్న ఫౌంటెన్ కొన్ని సంవత్సరాల తర బడిగా ఆగిపోయిన చిహ్నాలు కనిపిస్తున్నాయి. కలువ మధ్యలో ఒయ్యారంగా నిలబడి, నగిషీలు చెక్కిన అందమైన గ్రీకు పాత్రతో నీళ్ళు కుమ్మరిస్తున్నది, అర్ధనగ్నంగా ఉన్న ఒక యువతి. అయితే నీళ్ళు మాత్రం పడటంలేదు. తెల్లని ఆ పాలరాతి బొమ్మకు చెయ్యి విరిగి పోయింది. ఆమె శరీరపు వంపుల్లో ఎర్రదుమ్ము పేరుకుపోయింది.

అతను కుర్చీలోనుండి లేచి ముందుకు కదిలాడు. నారింజచెట్ల పక్కగా ఉన్న కాలవ దాటాడు. తేనెటీగలన్ని జుమ్మని లేచి మళ్ళీ అతనిపై వాలాయి. అతను ఆ స్త్రీమూర్తిని ప్రేమతో స్పృశించి తన అర చేతులతో ఆమెపై పేరుకొన్న దుమ్ము తుడిచాడు. సుకుమారమైన ఆమె చేతిని నిమిరి, తిరిగి వెళ్ళి కుర్చీలో కూర్చున్నాడు సుదూర తీరాలను చూస్తూ,

ఆకాశంలోకి పొడుచుకు పోతూన్న కొండ శిఖరాలు. పచ్చిక బయళ్ళతో కప్పుకొన్న అగాధమైన లోయలు. వాటి లోతులు తెలియని చంద్రుడు రేఖామాత్రంగా నిలిచాడు వాటి మధ్యన. చీకటి పడ్డాక ప్రయాణం వాయిదా వేసుకొన్న బాటసారిలా, కొండల వెనక ఆకాశపు టంచులు భూమిని తాకుచున్నచోట రవిరాజు పైకి వస్తున్నాడు.

చూపు మరల్చుకొని పుస్తకంలోకి చూడసాగాడు.

"బాత్‌రూమ్‌లో నీళ్ళు పెట్టాను. సాబ్ ..." సన్నని కంఠం ఉర్దూలో పలికింది. అతడు తల పైకెత్త లేదు.

మళ్ళీ పిలిచింది కొద్దిగా స్థాయి పెంచి.

అతని దృష్టి ఆమెపై నిలిచింది. బంగారుకాంతు లీనుతున్న శరీరం. కలల బరువుతో వాలిపోయిన విశాలమైన కనురెప్పలు. వాడిపోయినా. ఆకర్షణీయంగా ఉన్న చెక్కిళ్ళు. సన్నని పొడుగాటి ముక్కు. పలచని పెదవులు ఎర్రగా పంపుతిరిగి ఉన్నాయి. ఉదయపు లేఎండలో నుదుటిపై చిరుచెమటలు మెరుస్తున్నాయి. పచ్చని గడ్డిపై ముత్యాల్లా మిల మిలా మెరుస్తూన్న మంచు బిందువులు ఆమె పాదాలు స్పృశిస్తున్నాయి.

మెరుపులా పరదా చాటుకు వెళ్ళిపోయింది.

ఒకింతసేపు తన కనురెప్పలను రెపరెపలాడించిన ఆ స్త్రీమూర్తి అదృశ్యమైన వాకిలినుండి దృష్టి మరల్చుకొన్నాడు. చదువుకొన్న పేజీ కొద్దిగా మడిచి పుస్తకం మూసి బాత్‌రూంకేసి నడిచాడు.

మల్లెపూవులాంటి తెల్లనిబట్టలు అతని శరీరాన్ని ఆచ్ఛాదిస్తున్నాయి. వికసిత వదనంతో అ నారింజచెట్ల మధ్యకు తిరిగి వచ్చాడు. సుకుమారమైన అతని చేతివేళ్ళు పుస్తకాన్ని తాకాయి. ఒకచెయ్యి నారింజకొమ్మపై వేసి మరో చేతితో పుస్తకం పట్టుకొని చదువుకోసాగాడు,

"అబ్బబ్బ...కాఫీ తాగటం కూడా మరిచిపోతే ఎలా?" కప్, సాసర్ చేతితో పట్టుకొని ఆమె అరుస్తూ వచ్చింది. చామనచాయ. ఆమె కట్టు బొట్టు తీరులో తెలుగుదనం ఉట్టిపడుతూంది.

చిరునవ్వు అతని పెదవులపై మెరిసింది. ఆనందంతో అతని కళ్ళు తొణికిసలాడాయి. "నీవు ఉన్నావుగా...నా అవసరాలను నా కంటె ఎక్కువగా గుర్తించి తీర్చటానికి"...అంటూ కాఫీ కప్ అందుకొన్నాడు.

"సరేలెండి ... పొగడ్తలు..." సిగ్గు బుగ్గలను ఎరుపుచేసింది. లోపలకు నొక్కుకొన్న పెదవులు చిరునవ్వు దాచాయి. తన సంతోషాన్ని పైకి వ్యక్తం చెయ్యకుండా మెల్లిగా అడిగింది.

"ఈవేళయినా ఆ పని చూస్తారా!"

"ఏ పనీ?" కప్పు పెదవులనుండి తీసికొని అడిగాడు.

"మళ్ళీ మొదటికి వచ్చారు ... ఈవేళ ఆదివారమండీ. సిటీలో ఎక్కడయినా మంచి పోర్షన్ ఒకటి చూస్తానన్నారుగా? ఎన్నాళ్ళు ఈ దయ్యాల కొంపలో ఉండాలని రాసిపెట్టి ఉందో నా కర్థం కావటంలేదు. మీకేం మహానుభావులు! ఉదయం పదిగంటలకు వెళితే రాత్రికి కొంప చేరతారు. పిల్లలిద్దర్నీ పెట్టుకొని బిక్కు బిక్కుమని చచ్చేదాన్ని నేను." కోపంతో కూడిన విన్నపం వినిపించింది.

అతను ఆమెనుండి చూపు పక్కకి తిప్పుకొన్నాడు. నీరూ నింగీ కలుస్తూన్నచోట దూరతీరాలలో దేనినో పారవేసుకొన్నట్లు చూపులు ఆకాశపుటంచులను వెదుకుతున్నాయి. ఆమె మాటలు తనకు బాధ కలిగించినట్లు సుందరమైన అతని ముఖం రంగు మార్చుకొంది.

"మాట్లాడరేం?" ఆమె హెచ్చరించింది.

"నీవు మాట్లాడటం అయిపోయిందా?" అతని పెదవులనుండి మాటలు మెల్లిగా జారిపడ్డాయి.

"ఊఁ" నిట్టూర్పు విడిచింది.

"నేను చెప్పే మాటలు సరిగా అర్థంచేసుకోటానికి ప్రయత్నిస్తానంటే చెబుతాను. తెలిసిందా?" ఖాళీ అయిన కప్పు ఆమె కందించాడు.

"సిటీలోపల ఉండాలని నీవు ఎంతగా కోరుకుంటున్నావో అంత త్వరగా విసుగుపడిపోతావనుకొంటా. అర్థమయిందా? సిటీలోపల అద్దె కొంపలెలా ఉంటాయో తెలుసా? ఒక ఇంటిలో పది వాటాలు ఉంటాయి. అందరికీ కలిసి ఒక బావిగానీ పంపుగానీ ఉంటుంది. అస్తమానం ఆ పంపువద్ద తగాదాలు. తల పగిలిపోతుంది. ఆ వాటాలకు పక్కన కిటికీలు ఉండవు, ధాన్యపుకొట్లలా వాటికి వాకిళ్ళు మాత్రమే ఉంటాయి. అవికూడ ఆ పక్క వాటాలవాళ్ళు తిరుగుతూంటారు కాబట్టి ఎప్పుడూ

మూసుకోవాలి. గాలికీ వెలుతురుకూ ముఖం వాచిపోవాలి. వాకిలి దిగితే బజార్లో కాలుపెట్టాలి. ఉదయం పదిగంటలనుండి రాత్రి పన్నెండు గంటల వరకూ కార్లూ, సైకిళ్ళూ — ఒకటే రద్దీ. అవి రోడ్డుమీద దుమ్మంతా ఊడ్చి నెత్తిన పోస్తాయి. మరీ భయంకరమయిన దేమంటే అందరికీ కామన్ లెవేటరీ...ఛీ...ఛీ...తలచుకుంటేనే వాంతి వస్తుంది. పోనీ ఎలానో సరిపెట్టుకొందామంటే విపరీతమైన అద్దెలు. మనం ఉండలేం."

"ఊఁ"...ఏదో గభాలున జ్ఞాపకానికి వచ్చినట్లు ఆమె లోనికి వెళ్ళింది. అతను ఇంకా అగాధమైన ఆ లోయలకేసి చూస్తూ మాట్లాడుతూనే ఉన్నాడు.

"ఇక్కడ ఎంత హాయిగా ఉంది! చెవులు గింగురుమనిపించే ఫ్యాక్టరీల సైరన్లు, హారన్లు ఏమీలేవు. బిజీబిజీగా చెమటలు కక్కుకొంటూ ఓ మాట మాట్లాడటానికి కూడా తీరికలేక ఆ ప్రాణంలేని యంత్రాల్లో చిన్న భాగాలయిపోయిన మనుష్యులెవరూ ఇక్కడ లేరు.

"ఎంత ప్రశాంతంగా ఉంది, చూడు. ఈ నారింజచెట్లు, నిమ్మ చెట్లు. వీటి మధ్య కూర్చుని సాయంత్రంవేళ అస్తమయ సూర్యుణ్ణి చూడగలగటం ఎంత అదృష్టం! సాంధ్య కాంతుల్లో బారులుతీరిన కొండలు. ఆ కొండలపై ఆశలా మిణుకు మిణుకుమంటూ పొడుచుకువచ్చే నక్షత్రం. దానికి దూరంగా మరో నక్షత్రం భగ్న హృదయంలా నిలబడుతుంది. ఇటు చూస్తే సూర్యాస్తమయంకోసం కాచుకు కూచున్న ప్రేమికుడులా చందమామ భయం భయంగా పైకి వస్తూంటాడు. క్షణంలో ఆకాశమంతా మణులు విరిసినట్లు చుక్కలు! అనంతకోటి తారకలకు ఒక్కడే ప్రియుడు. కొండలచెంత వెన్నెలలో మిలమిలలాడే చెరువు."

ఆమె మళ్ళీ వచ్చింది. అతనలా కొండలవైపు చూస్తూ మాట్లాడుకోవటం చూసి విస్తుపోయింది.

అతని పాదాలు మంచుబిందువులతో మెరుస్తూన్న పచ్చికతో పరి

వేష్టితములయ్యాయి. ఆ గడ్డి మధ్య ఏపుగా పెరిగిన గడ్డి గులాబులు అతని పైజమా తాకుతున్నాయి.

"జీవితం అనుభవించటమంటే ఈ ముస్లిం నవాబులకు తెలిసినట్లు మనకు తెలియదనుకొంటా. ప్రకృతి అందానికి వాళ్ళు ఎంత విలవ ఇస్తారో ఈ భవనాలే నిదర్శనం. చూడు. నగరానికి దూరంగా ఈ కొండలపై గుట్టలపై ఎలా నిర్మించారో."

అతను పక్కకు చూశాడు మాటలు ఆపి.

దూరదూరంగా ఎత్తయిన ప్రదేశాలపై నిర్మించిన భవనాలు. కప్పులు కూలిపోయిన మొండిగోడలు, తలుపులు కిటికీలు పీకివేయబడి గుహల్లా ఉన్నాయి. పాడయిపోయిన ఆ సున్నపు గోడలపై విద్యార్థులు పెద్ద పెద్ద అక్షరాలతో పేర్లు చెక్కుకొన్నారు. అక్కడక్కడ గడ్డి మబ్బులు మొలిచాయి.

"అందుకనే వాళ్ళు ఇప్పుడిలా చితికిపోయింది. దేనికైనా ఒక హద్దూ ఆపూ ఉండాలి. ... ఎక్కడవరకూ ఎందుకు ? మన పనిమనిషిని మిహిరున్నిసాబేగాన్ని చూశారా ?" అంటూ చెంతనే ఉన్న గుండ్రని పేము కుర్చీలో కూర్చుంది. అతను అలానే కొమ్మపైకివాలి ఆమె పెదవులపై దృష్టి నిలిపి పలికాడు.

"చూడలేదు, చూడటానికి వీలెక్కడిది ! నేను అకస్మాత్తుగా ఎదురుపడినా, గభాలున పరదాచాటుకు పరిగెత్తుతుంది. ఈవేళమాత్రం ఒక్క క్షణం కనిపించింది స్నానానికి పిలవటానికి వచ్చినప్పుడు. ఏం ? ఎందుకు ?"

"పోయినవారం బకరీద్ పండక్కి యాభై రూపాయలు ఖర్చుపెట్టింది. ఒక మేకపోతుట. బిర్యాని, సేమియా! షేర్‌కుర్మా ఇంకా ఏమిటేమిటో చేశానని చెప్పింది. తనకు మనమిచ్చేది పదిరూపాయలు. తన భర్త కేదో మిల్లులో పనిట! రోజుకు రెండు రూపాయలుతెస్తాడు. ముందువెనక ఆలోచించకుండా అలా ఖర్చుపెట్టింది ఆవేళ. ఇప్పుడేమో రెండు రూపాయ

లిమ్మని కూర్చుంది. అందుకనే నవాబ్ దర్జా అంటారు ... అలా ఖర్చు పెట్టే వీళ్ళు ఇలా ఆరిపోయారనుకొంటా."

"అలా వాళ్ళనుకూర్చి మనం చెడుగా అనుకోకూడదు, జయా! ఒక రకమైన జీవితానికి అలవాటుపడ్డాక దానినుండి మళ్ళటం చాల కష్టం. వాళ్ళు ఎంత ఉన్నతంగా బ్రతికారో ఊహించుకోవచ్చు. ఇప్పుడు వాళ్ళ పరిస్థితులు మారినంతమాత్రాన వాళ్ళ అలవాట్లు మార్చుకోలేరుగదా? పాపం. మన మిహిరున్నీసా ఎంత కులీనవంశంలో పుట్టిందో! ఎంత అందం! చిరుగుపాతల్లో ఉన్నా అవి సౌందర్యాన్ని మరుగు పరచలేక పోతున్నాయి. తనను చూస్తూంటే గ్రీకు సౌందర్యదేవత వీనస్, ఉమర్ ఖయ్యాం రుబాయత్‌లలో సాకీ నా కళ్ళముందు కనిపిస్తున్నారు, అలాటి సౌందర్యరాశి ఇలా పనిమనిషిగా జీవిస్తూందంటే చాలా జాలివేస్తూంది. పనులు చేసేటప్పుడు ఎక్కువగా కసురుకోకు. పాపం!"

భ్రుకుటి కుంచించుకొని అతని ముఖంలోకి గుచ్చి గుచ్చిచూసింది ఆమె. ఆ మాట్లాడుతున్న తీరులో ఆవేశం లేదు. ముఖం ప్రశాంతంగా ఉంది. కళ్ళు పరాగ్గా ఎటో చూస్తున్నాయి. పెదవులు ఆగి ఆగి మెల్లి మెల్లిగా మాటలు వినిపిస్తున్నాయి. చిత్రంలో బొమ్మలా ఒకే భంగిమలో నిలబడి ఉన్నాడతను.

"అవునండీ పరదాచాటున ఘోషాలో ఉండే మిహిరున్నీసా ఇలా బయటికి వచ్చి పని చేస్తూంటే నాకూ పాపమనిపిస్తూంది. అందుకనే ఇదివరకు పనిమనిషికి ఎనిమిది రూపాయలిస్తే తనకు పది ఇస్తున్నా."

ఆమె ముఖం వివర్ణమైపోయింది. తనుకూడా భర్త చూస్తున్న సుదూర తీరాలకేసి ఓ నిమిషం చూసింది. కొండలోయలను చుట్టి హోరుమని బయలుదేరినగాలి రయ్యమని వీచి వాళ్ళను చుట్టివెయ్యసాగింది, ఆమె ముంగురులు భయంతో రెపరెపలాడిపోయాయి. ఆమె హృదయంపై కప్పుకొన్న సున్నితమైన పమిటచెరుగు కంపించి చేతిపై వాలిపోయింది. వెంటనే సంబాళించుకొని తన కంపిత హృదయంపై చీరెచెరగు నిండుగా కప్పుకొంది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ ?"

ఆమె ముఖాన్ని భావరహితంగా సహజంగా మార్చుకొని, "మీరు మిహిరున్నిసా భర్తను చూశారా ? ఎప్పుడూ తాగుబోతులా ఎర్రటి గుడ్లు సగం గీయించుకొన్న పిల్లిగడ్డం గళ్ళలుంగీ - మిహిరున్నీసా అత నితో జీవితం ఎలా వెళ్ళదీస్తుందో, ఏమో ?" అంది.

కొద్దిసేపు ఆగి మళ్ళీ అంది...

"అందమైన భర్తకు కురూపియైన భార్య, సౌందర్యవతి అయిన భార్యకూ అనాకా అయిన భర్త దొరుకుతారు. మీరు పరీక్షించారోలేదో అణకువ కలిగిన భార్యకు ఏ తాగుబోతో, వ్యభిచారో భర్తగా దొరకు తాడు. భగవంతు డెందు కిలా చేస్తాడో తెలియదు."

"అలానా !" అన్నాడు అమాయకంగా ఆమెకేసి చూస్తూ.

అతను మళ్ళీ పుస్తకంలోకి చూడసాగాడు.

ఆమె కుర్చీలోనుండి పైకి లేచి. "మరి నేను చెప్పిన విషయ మేమిచేశారు ? ఏమిటేమిటో మాట్లాడుతారుగాని ఇంటి విషయం మాత్రం మాట్లాడరు. మొన్న ఆ విజయనగర కాలనీలో ఎవరో ఆఫీసరు భార్యను చంపివేసి నగలు తీసుకొని వెళ్ళారట. ఆ మాట జ్ఞాపికి వస్తేనే భయం వేస్తుంది" అంది.

అతను తలపంచుకొనే మెల్లిగా అన్నాడు:

"మరి జాగ్రత్తగా ఉండు. నగలు పెట్టుకొని బయట తిరగకు."

"ఇంతకూ ఇల్లు మార్చనంటారు. అంతేనా ?" ఆమె ఖచ్చి తంగా అడిగింది.

"అబ్బబ్బ ! మార్చుదాంలే, జయా ! నీవు మీ వాళ్ళ పెళ్ళికి పోతున్నావుగా వచ్చేవారం. మళ్ళీ నీవు రెండు నెలలకుకాని రావు. నీవు వచ్చేటప్పటికి మంచి ఇల్లు చూస్తాను. ఇక నన్ను చదువుకోనీ." అతను కుర్చీ దగ్గిరికి లాక్కొని అందులో కూలబడ్డాడు.

"అయితే రెండ్నెల్లవరకూ ఇక్కడే ఉంటానంటారా ?"

"అవును. నా ఒక్కడి కోసమే ఎందుకు నెలకు డెబ్బయి, ఎనభై రూపాయలుపెట్టి పోర్షను తీసుకోవాలి?" అతను పుస్తకంనుండి చూపు మరల్చుకొని ఆమెకేసి చూస్తూ ప్రశాంతంగా అన్నాడు.

ఓ క్షణంసేపు అతని ముఖాన్ని పరిశీలించి, "సరేలెండి" అంటూ భారంగా అడుగులు వేసుకొంటూ లోనికి వెళ్ళింది. అతను చదువుకోవటంలో నిమగ్నుడయిపోయాడు.

* * *

సాయంత్రం ఐదు గంటలయింది. చెట్ల నీడలు ఒకదానితో మరొకటి కలిసిపోతున్నాయి. వాటి నీడల్లో అతను పేము కుర్చీలో కూర్చున్నాడు శిలగా మారిన గంధర్వుడిలా. చేతుల్లో పుస్తకం. వాక్యాలవెంట పరిగెత్తుతున్న అతని చూపులు.

ఎండుటాకులు గలగలమని శబ్దంచేశాయి. అతను తల ఎత్తి పరికించాడు.

పోస్టుమన్ తనకేసి వచ్చాడు కవరు చేత్తో పట్టుకొని. పుస్తకాన్ని విప్పినదాన్ని విప్పినట్లే బోరగిలా పెట్టాడు టీపాయ్‌మీద.

కవరు చించి ఉత్తరం బయటికి తీశాడు.

"ప్రియమైన శ్రీవారికి,

నమస్కరించి వ్రాయునది ఏమనగా మేము దైవానుగ్రహంవల్ల సురక్షితంగా చేరుకొన్నాం. చిరంజీవులు ఆరోగ్యంగా కులాసాగా ఉన్నారు. మరి బుజ్జిగాడు మీకు బాగా అలవాటు కావటంవల్ల రాత్రిళ్ళు నిద్రపోకుండా గొడవ చేస్తున్నాడు. పెళ్ళి బాగా జరిగింది. అందరూ మిమ్మల్ని అడిగారు.

నేను మొన్న వచ్చినప్పుడు మిహారున్నిసాను పనినుండి తొలగించి వచ్చాను. ఆవిషయం మీకు చెప్పటం మరిచాను. ప్రస్తుతం స్నానానికి నీళ్ళు తోడటానికి కాని, ఇల్లు శుభ్రపరచడానికిగాని మనిషి లేక

ఇబ్బందిపడుతూండవచ్చు. వేరే పనిమనిషిని చూడండి. మళ్ళీ ఆ మిహిరున్నీసాను పిలిపించకండి, ఆమె మనం ఊహించినంత మంచి మనిషి కాదు. ఎంత అందచందాలున్నా పాడు బుద్ధు లెక్కడికి పోతాయి ! పని మనిషి పనిమనిషే. మన వెండి గ్లాసు (బాబుగాడు పుట్టినరోజు కానుక) ఇట్టే మాయంచేసింది మొన్న నే రాబోయేముందు. మళ్ళీ మీరు అడగకండి పిలిచి.

మరీ ముఖ్యంగా వ్రాయవలసిన విషయ మేమంటే వంటగదిలోని పెద్ద టిన్నులో కందిపప్పు ఉంది. దానిని బయటకు తీసి ఆరబెట్టకపోతే తుట్టెలుపట్టి దేనికి పనికిరాకుండా అయిపోతుంది. అలానే మొన్నపెట్టిన ఆవకాయ, దానికి కొద్దిగా బూజు పట్టిందంటే మొత్తం పారవెయ్యవలసి వస్తుంది. అప్పుడప్పుడు మూత తీసిచూస్తూండండి. ఇక బియ్యం సంగతి. స్వయంగా వంట చేసుకోమంటే మీకు కోపం."

ఉత్తరం నిర్లక్ష్యంగా జారి పడిపోయింది. బోరగిలా ఉన్న పుస్తకాన్ని మళ్ళీ కళ్ళముందు పెట్టుకొన్నాడు. మనస్సు చదవడానికి నిరాకరించింది. తెరిచిన పేజీ అలానే ఉండిపోయింది. అతను తల పైకెత్తాడు.

ప్రహరీ ఆవల దూరంగా శిథిలావస్థలో ఉన్న భవనాలు, వాటి గోడలపైన గడ్డిదుబ్బులు, వాటి మధ్యన రెక్కలు విప్పుకొంటూన్న గుడ్లగూబలు.

ఎండుటాకులు గలగలమన్నాయి. అతను చూపు పక్కకు త్రిప్పుకున్నాడు.

"ఆదాబర్ జ్ !" ముస్లింసాంప్రదాయాల ననుసరించి వినయంగా ముందుకు వంగి నమస్కరించింది ఆమె.

"ఏమిటి, మిహిరున్నీసా?" అతని కంఠం ప్రశాంతంగా అడిగింది ఉర్దూలోనే.

"ఏమీలేదు, సాబ్, తమ దర్శనంకోసం వచ్చాను. అంతే."

కొద్దిక్షణాలు మౌనం. ఏదో చెప్పాలని ఆమె ఉత్కంఠ పడు

తున్నట్లు ఆమె కళ్ళు అతణ్ణి పరిశీలనగా చూశాయి. అతను తన మాటలు సావధానంగా వినే ప్రశాంత చిత్తంలో ఉన్నాడో లేదో గ్రహించటానికి ప్రయత్నిస్తున్నాయి ఆమె చూపులు.

అతను తన చేతుల మధ్య ముఖం పెట్టుకొని పుస్తకంలోకి చూస్తూ పేజీలు తిరగవెయ్యసాగాడు. కొద్ది క్షణాలయ్యాక పుస్తకంనుండి చూపు మరల్చుకోకుండానే అడిగాడు.

"మంచిది. ఎందుకు వచ్చావో చెప్పు?"

"సాబ్ ! నేను సరిగా పనిచెయ్యటం లేదని మీరు వద్దని చెప్పారని అమ్మగారు చెప్పారు" ఆమె మాటలు కంఠంలో తెగిపోయాయి.

అతను తల పైకెత్తాడు.

పశ్చిమాన అస్తమిస్తున్న సూర్యుడు. ఎర్రటి వెలుగులు మేఘాలను దూసుకువచ్చి ఆమె కపోలాలపై పడి మరింతగా రాగరంజితము లయ్యాయి.

"మగవాళ్ళ ముందుకు వచ్చి పనిచెయ్యటం అలవాటులేక మీ పనుల్లో పొరపాటుచేసి ఉండవచ్చు. క్షమాపణ కోరుకుంటున్నాను... ఈ మంజిల్ దాటి బయటకి వెళ్ళి ఈలాటి పని చెయ్యలేను. పేదదాన్ని మీరు..." ఆమె కంఠం రుద్ధమైపోయింది. మాటలు పెగిలిరాలేదు. శిరస్సు హృదయంపై వంగిపోయింది.

అతను విస్మయ దృష్టితో ఆమెను ఆపాదమస్తకం పరిశీలించాడు. గాలి స్తంభించిపోయింది.

ఆమె కనురెప్పలు మిలమిలా మెరిశాయి. రెండు కన్నీటి బొట్లు కనుకొలకులనుండి రాలిపడ్డాయి.

"ఏడుస్తున్నావెందుకు? ఏడవకు. ఏం కావాలో చెప్పు?" ఉర్దూ మాట్లాడటంలో ప్రవేశంలేని చిహ్నాలు కనిపిస్తూనే ఉన్నాయి. మాటలు జాగ్రత్తగా పొందుపరచుకొని మెల్లిగా మాట్లాడాడు.

ఆమె అలానే నిలబడిపోయింది, కళ్ళు తుడుచుకొంటూ.

"నీ పనులు నాకు నచ్చటంలేదని అమ్మగారన్నారా?" ఆలోచిస్తూ న్నట్లు పలికి, "ఇంకా ఏమంది అమ్మగారు?" అని ప్రశ్నించాడు.

"అవన్నీ ఎందుకు సాబ్? ఇక్కడినుంచి మీ పనులు చెయ్యటంలో కించిత్తు పొరపాటుకూడా చెయ్యను." కోమల కంఠంతో ప్రాధేయపూర్వకంగా అతని దయాభిక్ష అర్థించింది. వినయంగా ముందుకు వంగి సలాం చేసింది.

ఆమె చెప్పిన క్లుప్తమైన సమాధానంతో అతని హృదయం సంతృప్తి పడలేదు. కానీ ఎదటి వ్యక్తి మితభాషిణి. తరవాత తన పని మనిషి. అలాటి వ్యక్తితో మరింత తరిచి తరిచి మాట్లాడటం అతనికి అదోలా తోచింది. జరిగిన విషయాన్నే తెలుసుకోవాలనే ఉత్కంఠ బలవంతంగా అణచుకొన్నాడు.

"సరే, మంచిది. అమ్మగారు రెండు నెలల్లో వస్తుంది. అప్పుడు నిన్ను మళ్ళీ పనిలో పెట్టిస్తాను. ఇక వెళ్ళు."

"మన్నించాలి. అప్పటివరకూ మేము ఎలా బ్రతకాలి? మావారు కాలికి దెబ్బ తగలటంవల్ల నాలుగురోజుల నుండి ఫాక్టరీకి వెళ్ళటంలేదు. నిన్నటినుండి మేమందరమూ కటిక ఉపవాసం. పెద్దవాళ్ళం మేం ఎలానో ఇన్ని మంచినీళ్ళు తాగి వెళ్ళగలం. కానీ, సాబ్..." తన కటిక దరిద్రాన్ని, దుస్థితిని పరాయి వ్యక్తితో చెప్పుకోవలసిన అవసరం కలిగినందుకు ఆమె సిగ్గుతో కుంగిపోయింది. వాక్యాన్ని పూర్తిచెయ్యకుండా పెదవిని నొక్కుకొంటూ ఉండిపోయింది.

రెండు రోజుల నుండి ఆమె తన దయను అపేక్షించకుండా అభిమానంతో కుంగిపోవటం అతణ్ణి కలవరపరిచింది.

"అదికాదు, మిహిరున్నీసా! అంతగా పస్తులు పండుకొంటున్నప్పుడు నాతో చెప్పకూడదు?" కొద్ది క్షణాలు తటపటాయించాడు. అతని

చూపులు పక్కనే ఉన్న ఉత్తరంపైకి పాకాయి. ఉత్తరం పైకితీసి రెండు నిముషాలపాటు చదివాడు. నిశ్చితాభిప్రాయం అతని కళ్ళలో మెరిసింది.

"లోపల బియ్యమూ, పప్పూ, పచ్చళ్ళూ ఉన్నాయి. అవి ఎక్కడెక్కడ ఉన్నాయో నీకు తెలుసుగా? అవన్నీ పట్టుకువెళ్ళు." అతని చూపు పుస్తకంలోకి ప్రసరించింది. మనస్సు నిలిపి చదువుకోటానికి ప్రయత్నించసాగాడు.

అతను చూపిన ఆదరణకు, వాత్సల్యానికి ఆమె హృదయం అతని పాదాలముందు ప్రణమిల్లింది. ఈ ఆకస్మికమయిన ఆత్మీయతకు తట్టుకోలేక కళ్ళు దించేసుకొని పెద్ద నిట్టూర్పు విడిచింది.

"ఇంకా ఎందుకు నిలబడ్డావ్? త్వరగా తీసుకువెళ్ళి వంటచేసి పిల్లలకు పెట్టు." అతను తల పైకెత్తకుండా పలికాడు.

కృతజ్ఞత నిండిన చూపులతో అతనిని చూసి, వంగి; సలాంచేసి లోనికి వెళ్ళింది. ఒక రోజుకు సరిపడే బియ్యమూ పప్పూ తీసుకొని తిరిగి వచ్చింది.

అతను కాళ్ళు రెండూ టీపాయ్‌మీద పారవేశాడు తనవి కానట్లు. వాలు కుర్చీలో ఒక మూలగా వంగి కూర్చున్నాడు. పరిసరాన్ని పూర్తిగా విస్మరించి చదువులో మునిగిపోయాడు. అతని ఏకాగ్రత గ్రహించి ఆమె మెల్లిగా పిలిచింది.

"సాబ్!"

"......"

"సాబ్!"

"......"

అతను తలఎత్తి చూశాడు.

"నేను తీసుకువెళుతున్న వస్తువులివే, సాబ్." వస్తువులను అతని ముందు ప్రదర్శించబోయింది. ఆ చర్య అతనికి అవమానకరంగా అసహ్యంగా తోచింది.

"ఏమిటి మిహిరున్నీసా, మొత్తం అన్నీ పట్టుకువెళ్ళమన్నాను కదా?" కంఠంలో తన కోపాన్ని వ్యక్తపరచక ప్రశాంతంగా పలికాడు మామూలు ధోరణిలో.

ఆమె కనుబొమలు ముడిపడ్డాయి.

"అవన్నీ నాకెందుకు సాబ్?" ఆమె ముఖకవళికల్లో ఒక అజ్ఞాత సందేహం పొడసూపింది.

"అవి నాకుమాత్రం దేనికి? పట్టుకుపో." కంఠంలో ఆవేశం వినిపించింది.

"వద్దు, వద్దు, సాబ్. ఈ ఒక్క రోజుకు నా కివి చాలు." ఆమె కంఠస్వరం తగ్గించుకొని భయం భయంగా అంది.

అతను ఆమె దైన్య స్థితికి జాలిపడి అపారమైన దయ చూపె ట్టాడు. కాని, ఆమె దానిని స్వీకరించటానికి నిరాకరించింది. అందుకు అతని హృదయం నొచ్చుకుంది. ముఖం చిన్నబుచ్చుకొని గంభీరత చెడని కంఠంతో తిరిగి అన్నాడు :

"లేదు, మిహిరున్నీసా, మొత్తం తీసుకువెళ్ళు. ఎందుకు భయ పడుతున్నావు తీసుకెళ్ళటానికి?"

ఆమె తల వంచుకొని కొద్దిసేపు ఆలోచించుకొని, "ఏమీలేదు, సాబ్. అమ్మగారు వచ్చాక ఈ విషయం తెలిస్తే చాలా కోప్పడతారు. అయితే మీరు ఇవి నా కిచ్చినట్లు అమ్మగారితో చెప్పండి" అంది.

అతను తుళ్ళిపడ్డాడు. ఆమె మాటల్లో అంతులేని అగాధం కనిపిం చింది. ఆమె భావాలను గ్రహించటానికి ఆమె ముఖాన్ని పరిశీలనగా చూశాడు. ఒక్క క్షణం ఏదో ప్రశ్నించాలని కనుబొమలు పైకి విరుచు కొన్నాడు. మళ్ళీ వెంటనే కనురెప్పలు దించుకొని, "సరే, అలాగే" అన్నాడు.

ఆమె లోనికి వెళ్ళింది.

అతను తల దించుకొని చదువుతున్న పేజీని అన్నింటితోనూ కలిపివేసి ఒక్కొక్క పేజీని అనవసరంగా తిరగవేయసాగాడు చిన్నపిల్ల వాడిలా. అలా కొన్ని పేజీలు తిరగవేసి పుస్తకం మూసి తొడపై పెట్టుకొని అస్తమయ సూర్యుణ్ణి చూడసాగాడు.

పొద్దు పడమటి గర్భాన పడుతూంది. గుండ్రని నిప్పుముద్దలా దినకరుడు మెల్లిగా అవతలి లోకాలకు నిష్క్రమిస్తున్నాడు. ఆకాశం పసుపురంగు మార్చుకొని లేత ఎరుపురంగు పూసుకొంటూంది. తెల్లని కొంగలు మిలిటరీ సిపాయిల్లా వరసగా అరుచుకొంటూ వెళుతున్నాయి. చూస్తూండగానే సూర్యుడు కొద్దిక్షణాల్లో పూర్తిగా అదృశ్యమయి పోయాడు.

తను చదువుతున్న పేజీ మళ్ళీ విప్పాడు.

"సాబ్!" ఆమె మెట్లపై నిలబడి పిలిచింది. చేతుల్లో రెండు సంచులు బరువుగా వేలాడుతున్నాయి. వాటిని మెట్లపై పెట్టి. "నేను వెళుతున్నాను, సాబ్" అంటూ వినయంగా కృతజ్ఞతా పూర్వకంగా 'జీ హుజూర్' అన్న ధోరణిలో సలాం చేసింది.

"మంచిది, వెళ్ళు." వెనుతిరిగి అత నన్నాడు.

ఆమె నారింజచెట్ల మధ్యగా తప్పుకొని వెళ్ళిపోయింది. దృష్టికి మరుగైనప్పటికీ ఆమె పాదాల తొక్కిడివల్ల ఎండుటాకులు చేస్తూన్న గలగల శబ్దం కొద్దిసేపు వినపడింది. అతను ప్రయత్నపూర్వకంగా మనస్సు పుస్తకంవైపు మళ్ళించాడు.

మెల్లగా సంధ్య చీకట్లు అతనిని చుట్టుకోసాగాయి. అక్షరాలన్నీ ఒకదానితో ఒకటి కలిసిపోసాగాయి.

మళ్ళీ ఎండుటాకుల అలికిడి వినిపించింది. ఆమె మధ్యరెండు సంచులతో తిరిగి ఆ నారింజచెట్ల మధ్యగా రాసాగింది. అతని కళ్ళు విప్పా

రాయి. కుర్చీలో చేరగిలబడి కూర్చున్న అతను వెనక్కు జరిగి మామూ లుగా కూర్చున్నాడు.

ఆమె కోమల శరీరంపై అక్కడక్కడ కదుములు కదుములుగా రక్తం గడ్డకట్టింది. కళ్ళు ఎర్రగా ఉబ్బి వాచాయి.

"మన్నించండి! సాబ్, మీవి మీకు వాపసు ఇస్తున్నందుకు." వణుకుతున్న కంఠాన్ని అదుపులోకి తీసుకొని ఆమె అంది. అతని సమా ధానానికి ఎదురు చూడకుండానే చరచరా లోనికి వెళ్ళి ఆ సంచులు లోపల పెట్టి, "నేను వెళుతున్నాను, సాబ్" అంటూ ఆమె అటు తిరిగి రెండడు గులు వేసింది. నిశ్చేష్టుడై ఆమెకేసి చూస్తూన్న అతని కంఠంలో నుండి సన్నగా వినిపించాయి మాటలు.

"ఏమి టిదంతా?"

"ఏమీలేదు, సాబ్."

"ఏమీ లేకపోతే ఎందుకు వాపసు తెచ్చావ్? ఒంటిమీద ఈ దెబ్బ లన్నీ ఏమిటి?" అతని కంఠం భయాన్ని అదుపులో పెట్టుకొంటూ అడుగు తూంది.

అప్పటివరకూ ఆమె బలవంతంగా అణుచుకొంటూన్న దుఃఖం పెల్లుబికి వచ్చింది. కళ్ళపై చేతులు పెట్టుకొని ఏడవసాగింది. ఆ కళా విహీనమైన తోటలో సంధ్య చీకట్లలో ఆమె, ఏడుస్తూ.

ఎలా ఓదార్చాలో, ఏం చెయ్యాలో తెలియక తికమక పడిపో తూన్న అతను, ఇతరు లెవ్వరూ లేరు; ఆ భావం మరింత భయవిహ్వ లుణ్ణి చేసింది అతనిని. ఆ కొండ లోయలలో నుండి హోరుమని లేచిన గాలి అతణ్ణి చుట్టివెయ్యసాగింది. అతని సున్నితమైన పైజామా, లాల్చీ రెపరెపలాడుతూ వణికిపోసాగాయి.

నారింజ చెట్ల మధ్యగా కొండల పక్కగా అమాయికంగా నవ్వుతూ పున్నమి చంద్రుడు పైకి వస్తున్నాడు. కొండ శిఖరాల మధ్య ఉన్న గంభీరమైన లోయలు, మిణుకుమిణుకు మంటూన్న నక్షత్రం.

"ఏమిటి, మిహిరున్నీసా, పలకవేం?"

"ఏమీలేదు, సాబ్. పిల్లలు తిండికి చచ్చిపోతున్నారంటే మీకు దయ కలిగి బియ్యం, పప్పులు అన్నీ తీసుకపొమ్మన్నారా. తీసుకువెళితే తను నన్ను కొట్టాడు సాబ్. ఇవన్నీ ఉట్టివే ఎందు కిస్తాడని ఒళ్ళంతా హూనం చేశాడు సాబ్." మధ్య మధ్య అగుతూ ఏడుస్తూ పూర్తి చేసింది.

అతను అప్రతిభుడై పోయాడు. భ్రుకుటి పైకెత్తుకొని ఆమెను కన్నార్పకుండా ఓ క్షణం చూశాడు. ముఖంపై చిరుచెమటలు పుట్టాయి.

"వెళ్ళు. మిహిరున్నీసా, వెళ్ళిపో."

లాల్చీ జేబుల్లో చేతులు పెట్టుకొని నారింజచెట్ల మధ్య పెద్ద పెద్ద అంగలు వేస్తూ చంద్రుని దిక్కుగా నడిచాడు.

ఆకాశాన్ని తాకుతూన్న కొండ శిఖరాలు. వాటిమధ్య అగాధమైన భయంకరమైన లోయలు, పచ్చికతో అందమైన లోయలు. క్రూర మృగాలు సంచరించే లోయలు. వాటి మధ్య బిక్కుబిక్కుమంటూ పాలి పోయిన ముఖంతో చందమామ.